


# 3

పి. సత్యవతి

# నాలుగు దృశ్యాలు

**దృశ్యం ఒకటి :**

తెల్లవారుతూనే అమ్మ దగ్గర్నుంచీ ఫోన్

'నేరుగా అసలు విషయంలో కొస్తా... 'నాలుగు' చూసి రెడీగా వుంచా ఈ నెల్లో వచ్చి ఏదో "ఒకటి" సరే అను. ఇక నా వల్ల కాదు. నాలుగు ప్రొఫైల్స్ "ఎక్స్ డాట్ కాం" లో వున్నాయి. ఆ నెంబర్లూ వాళ్ళ ఐ.డి.లూ నీకు మెయిల్ చేస్తా. ఛాటింగ్‌కి వాళ్ళకేం అభ్యంతరం లేదట. తీరికుంటే మాట్లాడి చూడు. వుంటా."

"అలాగే. అలాగే"

✿ ✿ ✿

**దృశ్యం రెండు :**

"హా- య్ నేను కృష్ణ.... అమ్మ చెప్పే వుంటుంది"

"నేను గీత మీతో మాట్లాడ్డం సంతోషం"

"నాకూ అంతే.... మనం ఒకర్ని గురించి ఒకరం తెలుసుకోడం మంచిదికదా ! అందుకని..."

"అవునవును చెప్పండి... మీ రుచులు అభిరుచులు ఆశయాలు... అభిప్రాయాలు..."

✿ ✿ ✿

"హలో. నేను కృష్ణ... అమ్మ చెప్పే వుంటుంది..."

"చెప్పారండి... నేను వసంతని..."

"మనం... కలిసే లోగా కాస్త మాట్లాడుకుంటే బాగుంటుందని. అసలు మీ అభిరుచులు... ఆశయాలు అభిప్రాయాలు తెలుసుకుందామని"

"మంచిదే కదా ! మరి మీ గురించి చెప్పండి"

✿ ✿ ✿

"హా -య్ నేను వందన. నన్ను గురించి. ఆంటీ చెప్పే వుంటారు..."

"అవును చెప్పింది... ఏంచేస్తున్నారు? ఎలా వున్నారు... మీరు బాగా పాడతారుట కదా ! కర్ణాటకమా, హిందుస్థానీయా, సినిమా సంగీతమా?'

"అన్నీ మరి మీరేం చేస్తున్నారు?

✿ ✿ ✿

"హా - య్ నేను సుధ."

"హెలో కృష్ణా హియర్...

✿ ✿ ✿

**దృశ్యం మూడు :**

"ఏమిట్రా? ఎప్పుడొస్తున్నావు? వాళ్ళతో ఏమన్నా మాట్లాడావా..."

"ఆ... మాట్లాడుతూనే వున్నా..."

"ఏమన్నా తేల్చుకున్నావా?"

"వచ్చాక చూద్దాంలే అమ్మా ! ఎటూ పది రోజుల్లో వస్తున్నా కదా !"

"ఇప్పటికే నెలరోజులుగా పెండింగ్ పెడితిమి గదా ఏదో ఒకటి సరే ననరా తండ్రీ..."

"ఒకటి ఫరవాలేదనిపిస్తోంది.... ఇవ్వాళ మాట్లాడేసి ఫైనల్‌గా రేపు చెప్పేస్తా"

"ఆ పని చెయ్ నాన్నా దేముడికి కొబ్బరికాయ కొడతా"

✿ ✿ ✿

**దృశ్యం నాలుగు :**

"హా - య్ నేను గీతని... మీకెలా చెప్పాలా అని చూస్తున్నాను, మా నాన్నగారుకూడా "నాలుగు" చూస్తున్నారని చెప్పా కదా. అందులో 'ఒకటి' కుదరిపోయింది. వాళ్ళకి పదిరోజుల్లో పెళ్ళి అయిపోవాలిట. అంతా నిన్నటినించే మొదలు... హా-లు బుక్ చెయ్యడం అన్నీ... లెట్ అజ్ బి ఫ్రెండ్స్...."

"మంచిదే కదా. మీకు అభినందనలు."

✿ ✿ ✿

"హా -య్ ఏం పాట పాడుకుంటున్నారు?"

"హెలో... ఎలా వున్నారు... నిజంగానే పాట పాడుతున్నా... నిరుడు ఒక ఉద్యోగానికి దరఖాస్తు పెట్టానని చెప్పా కదా మీకు... ఇంటర్వ్యూకి వెళ్ళొచ్చానని చెప్పలేదనుకుంటా... ఆ ఉద్యోగం వచ్చేసింది... ఎల్లుండి చేరిపోతున్నా.... నెలరోజులుగా మనం.... చాలా మాట్లాడుకున్నాం... చాలా గడుసుగా. ఎటూ ఎవరం తేలకుండా... మంచి కాలక్షేపం... మీ నలుగురితో మాట్లాడుతున్నానని చాలా నిర్మొహమాటంగా చెప్పాడు. అదే నాకు నచ్చింది... ఇది చాలా మంచి ఉద్యోగం.

ఇందులో నిలదొక్కుకున్నాకే పెళ్ళి... వుంటానండీ... థ్యాంక్స్

✿ ✿ ✿

"హెలో... ఎప్పుడొస్తున్నారు..."

"వచ్చేవారం..ఏమిటి సంగతులు... ఏం సినిమా చూశారీ శనివారం...."

"సినిమా లేదు మా మామ్మ చెప్పినట్లు చిత్రమూలమూ లేదు.... రెండు నెలల నుంచీ "ఒకటి నలుగుతోంది" లెండి మా నాన్నగారేమో అదే ఖాయం చేద్దాం మీ అమ్మ గారెటూ తేల్చడం లేదు కదా అన్నారు. మా చెల్లి నా కన్నా ఏడాదిన్నరే చిన్నదీ. నాకే ఇంతకాలం పడితే మరి దాని సంగతి కూడా చూడాలిగా నిన్న సరే ననుకున్నాం....."

"మంచిదే కదండీ..."

✿ ✿ ✿

"హాయ్ ఎలా వున్నారు?"

"బావున్నానండీ... మీతోఇంతకాలం మాట్లాడినా మిమ్మల్ని అర్థం చేసుకోలేకపోతున్నానండీ. కృష్ణా... ఏమో ! నాకైతే మనిద్దరం కలిసి బ్రతకటం "వర్కౌట్" కాదనిపిస్తోంది... అయినా... ఇలా మీరు రావడం నాలుగులోంచి ఒకటి ఏరుకోవడం... అందులో నేనో మరొకరో అని నేను ఎదురుచూడ్డం నాకు నచ్చలేదని మానాన్నద్వారా మీ అమ్మకి చెప్పించేశాను. పోనీ మీతో స్నేహం సాగిద్దామన్నా మీకూ నాకూ ఎక్కడా అభిప్రాయాలు కుదరడం లేదు. వుంటానండీ...."

✿ ✿ ✿

"ఏం రా ! బయలుదేరుతున్నావా?"

"లేదమ్మా ! ఇకనించీ ఇట్లా నాలుగుచూడకు...ఏదో ఒకటి చూసి నువ్వే సెటిల్ చేసెయ్.... ఎప్పుడురావాలో చెప్పు అప్పుడొచ్చేస్తా.. అవునూ... నీ గొంతేమిటలా వుంది ?"

"ఇందాకా టీవీ వార్తల్లో సెన్సెక్స్ భారీపతనం అంటేనూ...."

"మళ్ళీ కోలుకుంటుందిలే. నువ్వే బాధపడకు.. ఉంటా...."

## ప్రతిక్షణం

**జి. విజయలక్ష్మి**

ప్రపంచ పటం నిండా నెత్తుటి రేఖలే
దేశదేశాల అంచుల చివరవరకు కక్షల కార్చిచ్చులే
భూగోళమంతా అగ్నిగోళమే
రుధిర దారల్లో ధరిత్రి ప్రతిక్షణం తలంటు పోసుకుంటుంది
తలలు బంతుల్లా ఎగిరిపడుతున్నాయి
నుజ్జయిన మొండాలు
శవాల గుట్టలమీద ఎగురుతున్న రాబందులు
ఆప్తుల ఆర్తనాదాలు
మతాల మారణహోమంలో నెత్తుటిలో తడిచిన నెలబాలుడు
జ్వాలై మండుతున్నాడు
కంకాళాల మీద కురిసే అగ్ని వర్షంలోంచి రెక్కలల్లార్చుకుంటూ
ఎగిరిపోతున్న శాంతిపావురాలు
తెగిపోయిన అవయవాలు
గురిపెట్టిన ఆయుధమై ఉగ్రవాదం ఊపిరితీస్తుంది
భయం గుప్పిట్లో మరణం ప్రతిక్షణం
మానవ బాంబుల మధ్య మసలే జనం.